ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
శనివారం 30 నవంబరు 2024



న్యూస్ బాక్స్

బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాలరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సన్న రకాల ధాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 500 రూపాయల బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రాంచంద్రం సూచించారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస ఐకేపీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తొందరపడి సన్నరకం ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏవో తిరుపతి నాయక్, ఏఈవో రమ్య పాల్గొన్నారు.

'రైతు పండుగ'లో పాల్గొనాలి

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం రైతు పండుగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, రైతులు మండలంలోని అల్లీపూర్ రైతు వేదికలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ తెలిపారు. కార్యక్రమం ఈ నెల 28న ప్రారంభమై 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

భీమారం (ఆంధ్రజ్యోతి): రైతులు శనివారం మధ్యాహ్నం మేడిపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ తెలిపారు.

వేతనాలు రాక మెప్మా ఆర్పీల విలవిల

- నెలనెలా అందక ఆర్థిక ఇక్కట్లు
- పెండింగ్ వేతనాల మంజూరుకు తప్పని ఎదురుచూపులు
- జగిత్యాల జిల్లాలో 173 మెప్మా రిసోర్స్‌పర్సన్‌లు
- వేతన బకాయిలు రూ. 51.90 లక్షలు



జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లుగా సేవలందిస్తున్న చిరు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక విలవిల్లాడుతున్నారు. అరకొర వేతనం అందిస్తున్నప్పటికీ నెల నెల విడుదల చేయకపోవడంతో ఆర్థిక ఇక్కట్లకు గురవుతున్నారు. మున్సిపాలిటీల్లో స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించాలన్నా-

ప్రభుత్వ పథ కాలు ప్రజలకు చేరువ చేయాలన్నా మెప్మా ఆర్పీల పాత్ర కీలకంగా ఉంటుంది. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలోనూ ఆర్పీలు తమ దైన బాధ్యతలను నిర్వర్తించారు. మహిళ సంఘాల సభ్యుల సమస్యల పరిష్కారం, రుణాల అందజేత, రికవరీ తదితర వాటిల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆర్పీలకు అయిదు నెలలుగా వేతనం అందడం లేదు.

అన్ని మున్సిపాలిటీల్లోనూ..

జగిత్యాల జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల్లో కలిపి 173 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లున్నారు. జిల్లా లోని మున్సిపాలిటీల్లో గల 5,337 స్వయం సహాయక మహిళా సంఘాల్లో గల 58,043 మంది సభ్యులకు అవసరమైన బ్యాంకు, ఇతర సేవలను ఆర్పీలు అందిస్తున్నారు. ఇందులో జగిత్యాలలో 61 మంది, కోరుట్లలో 50, మెట్‌పల్లిలో 34, రాయికల్‌లో 16, ధర్మపురి మున్సిపాలిటీలో 12 మంది రిసోర్స్ పర్సన్‌లు పని చేస్తున్నారు.

మున్సిపాలిటీల్లో 15 నుంచి 20 మహిళా సంఘాలకు ఓ వార్డు సమాఖ్య ఉంటుంది. ప్రతీ సమాఖ్య పరిధిలో ఒక రిసోర్స్ పర్సన్ పనిచేస్తారు. మహిళా సంఘాల సమావేశాల నిర్వహణ, రికార్డులు, బ్యాంకు రుణాలు ఇప్పించడం, వాయిదాలు సకాలంలో చెల్లించడం, రికవరీ తదితర బాధ్యతలను నిర్వర్తిస్తుంటారు. వీరికి నెలకు రూ. 6 వేతనం చెల్లిస్తున్నారు. ఈ వేతనం మెప్మా మహిళా సమాఖ్య ఖాతాలో జమ చేస్తారు. సమాఖ్య నుంచి వేతనం మొత్తాన్ని ఆర్పీలు తీసుకుంటారు. సమాఖ్య లాభాల్లో ఉంటే నెలకు రూ. 2 వేలు అదనపు వేతనం ఆర్పీలకు అందుతుంది. వీరికి ప్రస్తుత యేడాది జూన్ నుంచి వేతనాలు అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా గల 173 మంది ఆర్పీలకు అయిదు నెలలకు కలిపి రూ. 51.90 లక్షల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. పెండింగ్ వేతనాల విడుదల కోసం మెప్మా రిసోర్స్ పర్సన్‌లు ఎదురుచూస్తున్నారు.

మిగతా 6 పేజీలో

ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తాం

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా వ్యవహరిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,26,890 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. దానికి సంబంధించి 27,530మందికి పైగా రైతులకు సుమారు 433 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేశామని వివరించారు. సుమారు 2,148 మెట్రిక్ టన్నుల సన్న వడ్లను కొనుగోలు చేశామని తెలిపారు. దీనికి సంబంధించిన బోనస్ 3.16 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా, తప్ప, తాలు, తేమ పేరుతో తిప్పలు పెట్టకుండా వడ్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 72,100 మంది రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని వెల్లడించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల 19,464 మంది రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. వీరికి సైతం సాధ్యమైనంత తొందరలో రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. మహబూబ్‌నగర్‌లో జరగనున్న ప్రజా విజయోత్సవాలు- రైతు పండుగ మహాసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించే కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ఏర్పాటు చేయనున్న డిజిటల్ స్ర్కీన్ ద్వారా రైతులు తిలకించవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా వ్యవసాయ అధికారి రాంచందర్, సివిల్ సప్లయిస్ అధికారి ఎస్ జితేందర్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం ఎస్‌జీ జితేంద్రప్రసాద్, జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్ రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గెజిటెడ్ అధికారుల కార్యవర్గం

జగిత్యాల అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గెజిటెడ్ అధికారుల నూతన కార్యవర్గం జగిత్యాల ఎమ్మెలే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, అరిగెల అశోక్, గణేష్, అత్తినేని శ్రీనివాస్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



పాఠశాలలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కథలాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మెస్ వర్కర్లు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులు పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేలా చూడాలని సూచించారు. పరిసరాలను పరిశీలించి ఆవరణలో చెత్త చెదారం, పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని ఆదేశించారు. ల్యాబ్‌ను పరిశీలించి ప్రయోగాలు ఎప్పటికప్పుడు జరిగేలా చూడాలన్నారు. హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయడంతో పాటు మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురికినీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం తక్కళ్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రవాణా, కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను సీఈవో రాంప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట కోరుట్ల ఆర్డీవో జికేందర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్, ప్రిన్సిపాల్ అనిత, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ బత్తుల నరేశ్, రైతులు ఉన్నారు.

సింగిల్ విండోలో రైతు పండగ

కొడిమ్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయలంతో పాటుగా మండలంలోని తిర్మాలాపూర్, పూడూర్ సింగిల్ విండో కార్యాలయాల్లో శుక్రవారం రైతు పండగ కార్యాక్రమాన్ని సింగిల్ విండో సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమాలో సింగిల్ విండోల కార్యదర్శులు కుర్షీద్, రాజేందర్‌రెడ్డి, గంగాధర్, సిబ్బంది, పలువురు రైతులు, గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

(01ఎంఎల్ఎల్29)ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శిథిలావస్థలో గురుకుల పాఠశాల భవనం

ఆరుబయటే స్నానాలు, మలమూత్ర విసర్జనలు

4



తరగతి గదిలో నేలపై కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రజల ఆహ్లాదం కోసం అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

6



జగిత్యాల పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన కేసీఆర్ దీక్ష

- బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ సలీం - ఘనంగా దీక్షా దివస్



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నేతలు

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ఆమరణ దీక్ష మలుపుతిప్పిందని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ సలీం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులో గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్‌ను నిర్వహించారు. ముందుగా కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దీక్షా దివస్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ సలీం మాట్లాడారు. తెలంగాణ గతిని పూర్తిగా మలుపు తిప్పిన ఘట్టం దీక్షా దివస్ అని వివరించారు. బీఆర్ఎస్ తొమ్మిది సంవత్సరాల పాలన తెలంగాణకు స్వర్ణయుగం లాంటిందన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను కాపాడుకోవడానికి మరో సంకల్ప దీక్ష అవసరమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ సభలో కేసీఆర్ నామస్మరణ చేయడం తప్ప, ఆయన ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేస్తోందో వివరించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పడకేసిందని, హామీలు నీటి మూటలయ్యాయని వాటిని ప్రజల్లో ఎండగడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, జగిత్యాల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు సతీష్, వివిధ మండలాల కార్యకర్తలు, పార్టీ అన్ని విభాగాల బాధ్యులు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో మరింత తగ్గిన ఉష్ణోగ్రతలు

జగిత్యాల అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ఉష్ణోగ్రతలు శుక్రవారం మరింత తగ్గాయి. ఉదయం 8-30 గంటలకు జిల్లాలోని మల్లాపూర్ మండల కేంద్రంలో 14.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా అత్యధికంగా బుగ్గారం మండలంలో 18.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఇక జిల్లాలోని మల్లాపూర్ మండలంలో 10.5, భీమారంలో 10.5, ఎండపెల్లిలో 11.2, కోరుట్లలో 11.3, కథలాపూర్‌లో11.4, మెట్‌పెల్లిలో 11.5 రాయికల్‌లో 11.7, మెడిపెల్లిలో 11.8, పెగడపెల్లిలో 12.0, ఇబ్రహీంపట్నంలో 12.0, సారంగాపూర్‌లో 12.0, మల్యాలలో 12.2, జగిత్యాలలో 12.4, ధర్మపురిలో13.0, కొడిమ్యాలలో 13.5, జగిత్యాల రూరల్‌లో 13.5, వెల్గటూర్‌లో 14.0, గొల్లపెల్లిలో 15.5, ఎండపెల్లిలో 16.1 సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మాతా శిశు సంక్షేమ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి హెచ్చరించారు. ధర్మపురి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన పత్రాల ఆధారంగానే వైద్యులు అందుబాటులో ఉన్నారా లేదా అనేది పరిశీలించారు. ప్రైవేట్ ఆసుపత్రులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఆసుపత్రుల్లో రికార్డులు, మౌళిక సదుపాయాలను కూడ ఆయన పరిశీలించారు. పరిసరాలను కూడ పరిశుభ్రంగా ఉంచాలని ఆయన తెలిపారు. ఆయన వెంట డాక్టర్ రవి, సూపర్‌వైజర్ శ్యాంసుందర్, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్సీ



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరాభవన్‌లో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 278 మంది లబ్ధిదారులకు మంజూరైన 2.10 లక్షల రూపాయల విలువగల సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీని వినియోగించుకొని రూ.10లక్షల ఉచిత వైద్య సేవలు పొందవచ్చన్నారు. రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సన్నరకం వడ్లకు 500 రూపాయల బోనస్ ప్రకటించిందన్నారు. రాష్ట్ర ఇప్పటికే 75శాతం రైతు రుణమాఫీ జరిగిందని, మరో 25శాతం మాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ చేయలేదన్నారు. ప్రధాని మోదీ మాటలే తప్ప, రైతాంగానికి మాఫీ చేయాలనే ఆలోచన రాదన్నారు. కేవలం అదానీ, అంబానీలకు మాత్రమే మాఫీ చేస్తారని ఎద్దేవా చేశారు. పేదల సంక్షేమమే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని, అధికారంలోకి రాగానే మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇచ్చిందన్నారు. మహిళలకు ఉచిత రవాణా, రూ.500కే సిలిండర్, రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలను మహిళా సంక్షేమంలో భాగంగా అమలు చేశారన్నారు. 2014లో ఎమ్మెల్యేగా, 2019లో మండలి సభ్యుడిగా గల్ఫ్ సమస్యలను సభలో లేవనెత్తినా సమస్యలు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డితో గల్ఫ్ సంక్షేమ బోర్డు అమలు చేయించగలిగానన్నారు. దీని ద్వారానే ప్రసుత్తం గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు లక్షల సహాయం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేదల కుటుంబానికి అండగా నిలిచి, వారికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గోదాంల నిర్మాణానికి సహకరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మల్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్యాల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో గోదాంల నిర్మాణానికి సహకరించాలని కోరుతూ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కరీంనగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మార్కెట్ పరిధిలోని రైతుల సౌకర్యార్థం మల్యాల మండలం నూకపల్లి గ్రామ శివారులో, కొడిమ్యాల మండలంలో తిర్మాలాపూర్‌లో ఐదువేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంల నిర్మాణానికి నాబార్డు ద్వారా నిధులు మంజూరికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయా గోదాంలకు స్థల కేటాయింపునకు తహసీల్దార్లకు సూచించాలని విన్నవించారు. ఎమ్మెల్యేకు వినతిప త్రం అందజేసిన వారిలో వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, యువజన కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్ ఉన్నారు.

ఎలాంటి సమస్యలున్నా పోలీసులను సంప్రదించాలి

- ఎస్పీ అశోక్ కుమార్



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతులు తమకు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో షీటీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ టీం, తెలంగాణ మహిళా రక్షణ విభాగం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలు, బాలికల కోసం పోలీసు శాఖ ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటుందని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహిళలు, విద్యార్థులు, బాలికలు తాము పనిచేస్తున్న, చదువుతున్న ప్రాంతాల్లో లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌కు గురవుతున్నా తమకు సమాచారం అందించాలని కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిర్భయంగా వారి సమస్యలను తెలుపుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీ రవీంద్ర కుమార్, రఘు చందర్, రాములు తదితరులున్నారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరి..

- 18 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులు
- రెగ్యులరైజ్ చేయాలని వేడుకోలు



సబ్‌స్టేషన్ ఆర్టిజన్ కార్మికులు



జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న నాయకులు(ఫైల్)

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో 800 మంది ఆర్టిజన్ కార్మికులు 18 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరిందరినీ పర్మినెంట్ చేస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చారు. అది కార్యరూపం దాల్చలేదు. జూలై 2017లో ఆర్టిజన్ కార్మికులను విద్యుత్ శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొంతమంది నిరుద్యోగులు ఇది అక్రమమంటూ కోర్టులో కేసు వేశారు. ఆర్టిజన్ కార్మికులు కోర్టుకు వెళ్లగా హైకోర్టుకు వారికి అనుకూలంగా సెప్టెంబరు 2018లో తీర్పు ఇచ్చింది. తర్వాత ప్రభుత్వం ఆ విషయం మరిచిపోవడంతో ఆర్టిజన్ కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలోనే పని చేస్తున్నారు.

● పని భారం

ఆర్టిజన్ కార్మికులపై రోజురోజుకు పనిభారం పెరుగుతోంది. ఒక్కో సబ్‌స్టేషన్లలో ఐదుగురు చేయవలసిన పనిని ఇద్దరు, ముగ్గురితో చేయిస్తున్నారు. స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ ప్రకారం ఎనిమిది గంటల షిఫ్ట్ డ్యూటీ, వారంతపు సెలవు ఇవ్వాలి. ఓవర్‌టైం చేయిస్తే అందుకు వేతనం ఇవ్వాలి. కాని ఇందుకు విరుద్ధంగా ఎక్కువ సేపు పని చేస్తున్నారు. ఎటువంటి అదనపు వేతన ఇవ్వడం లేదు. సిబ్బంది కొరతతో వారం రోజులు డ్యూటీలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. చాలీచాలని జీతాలతో, భద్రత లేని ఉద్యోగం చేస్తూ ఆర్టిజన్ కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ ప్రకారం గ్రేడ్ మార్పితే ఒక్కో కార్మికుడికి మూడువేల నుంచి ఐదువేల రూపాయల వరకు జీతం పెరుగుతుంది.

రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ ఇస్తే ప్రస్తుతం తీసుకుంటున్న జీతభత్యాలు మాత్రమే వస్తాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటారు. పర్మినెంట్ చేస్తే ప్రభుత్వంపైన ఆర్థిక భారం తగ్గించేందుకు తాము ఇప్పుడు ఇస్తున్న జీతభత్యాలతోనే పని చేస్తామని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆర్టిజన్లు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించండి..

ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందిస్తున్న ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 20 వేల పైచిలుకు ఆర్టిజన్ కార్మికులు పనిచేస్తున్నారు. తమను పర్మినెంట్ చేయాలని వీరందరూ కోరుతున్నారు. ప్రభుత్వాలు విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.



- రఘునాథ్‌రెడ్డి, టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి

చాలీచాలని జీతాలతో పని చేస్తున్నాం..

చాలీచాలని జీతాలతో 18 ఏళ్లుగా విద్యుత్ శాఖలో ఆర్టిజన్ కార్మికులుగా పనిచేస్తున్నాం. గత ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను విద్యుత్ శాఖలో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి నిలిపివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా సమస్యలు పరిష్కరించాలి.



- శివ కృష్ణ, విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

మా సేవలను గుర్తించండి

విద్యుత్ సంస్థకు ఏళ్లుగా సేవ చేస్తున్నాం. కష్టాలు ఎదురైనా ప్రజలకు విద్యుత్ అందిస్తున్నాం. మా సేవలను గుర్తించి రెగ్యులర్ పోస్టులోక్లి కన్వర్షన్ చేయాలని కోరుతున్నాం.



- కునుసోత్ శ్రీనివాస్‌నాయక్, ఆర్టిజన్ గ్రేడ్ -1 కార్మికుడు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన బోరాల రాజేందర్ (30) అనే కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాపక్కపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ తనకు సొంతంగా ఉన్న ఎకరంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా ఆశించిన మేర పంట దిగుబడి రావడం లేదు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు సుమారు 6లక్షల రూపాయల వరకు పెరిగిపోయాయి. పంట దిగుబడి రావడం లేదని, చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. ఈ నెల 23న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కొంత సేపటికి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు రాజేందర్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాజేందర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

నాగారంలో గల్ఫ్ బాధితుడు..

కోనరావుపేట, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన గల్ఫ్‌బాధితుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన దూస వెంకటేష్ (34) అనే యువకుడు ఆరు నెలల క్రితం రూ.3 లక్షల అప్పు చేసి ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. వెళ్లిన కంపెనీలో సరైన పని లేకపోవడం, మరో చోట పని దొరకకపోవడంతో మూడు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గ్రామంలో చేసేందుకు పనిలేక, అప్పులు తీర్చే మార్గం కనిపించక మనోవేదనకు గురయ్యాడు. ఈ నెల 23న గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వెంకటేష్‌కు భార్య సంధ్య, ఇద్దరు కూతుర్లు నిత్యశ్రీ, నయనశ్రీ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తం



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ స్వేరో

గణేశ్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తంగా మారాయని ఎస్సీఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంకటి శేఖర్ స్వేరో అన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మానవతరాయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ముకరంపుర చౌరస్తాలోని ఓ ప్రైవేటు హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్ గురుకుల పర్యటన అంటే కాంగ్రెస్ వాళ్లకు భయమేస్తోందన్నారు. గతంలో ప్రవీణ్‌కుమార్ గురుకులాల సెక్రటరీగా ఉన్నప్పుడు వాటిని ప్రపంచంలోనే ఉన్నత స్థాయికి తీసుకెళ్లారన్నారు. వాటికి ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించేలా అనేక కృషి చేశారన్నారు. పిల్లలను ఉన్నత లక్ష్యాలతో గమ్యం వైపు పయనించేలా చేశారన్నారు. వందల మంది డాక్టర్లను, ఇంజనీర్లను తయారు చేశార న్నారు. దాదాపు 50దేశాలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పిల్లలు చదివేలా చేశారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పిల్లలకు విదేశాలలో చదువుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వం నుంచి విదేశీ విద్య నిధి రూ. 20 లక్షలు ఇచ్చే విధంగా అప్పటి ముఖ్య మంత్రి కేసీఆర్‌ని ఒప్పించారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శాతవాహన ఇంచార్జి చుక్క శ్రీనివాస్. కరీంనగర్ పట్టణ అధ్యక్షులు బొంకూరి మోహన్, అన్వేష్. శాతవాహన ప్రెసిడెంట్ కల్యాణ్ విద్యార్థి నాయకులు సోహెల్, సాధిక్, మహేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన దివ్యాంగులు



దివ్యాంగులను అభినందిస్తున్న శైలజ

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడల్లో జిల్లాకు చెందిన దివ్యాంగులు ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లా దివ్యాంగులు వికలాంగులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ చేతుల మీదుగా దివ్యాంగులు సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడల్లో సిల్వర్ మెడల్స్‌ను సాధించిన దివ్యాంగులను శుక్రవారం సిరిసిల్లలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం అభినందించారు. అంతర్జాతీయం దివ్యాం గుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్ అంధుల రన్నింగ్ పోటీలో ఎం.కార్తీక్(వెంకటాపూర్), ఆర్థోపెడిక్ సీనియర్ షాట్‌పుట్ త్రోలో ఎం .అర్చన (చంద్రంపేట) ద్వితీయ స్థానంలో నిలచి పతకాలు అందుకున్నారు.

షార్జా ఎయిర్‌పోర్టులో నంచర్ల వాసి అరెస్టు

- విడుదల చేయించాలని ప్రవాసీ ప్రజావాణిలో దరఖాస్తు



ప్రవాసీ ప్రజావాణిలో దరఖాస్తు చేస్తున్న శ్రీధర్ తల్లి ప్రమీల

పెగడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన సుంకరి శ్రీధర్ యూఏఈలోని షార్జా ఏయిర్ పోర్టులో అరెస్ట్ అయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నంచర్ల గ్రామానికి చెందిన సుంకరి శ్రీధర్ బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ పనులు చేసి ఈ నెల 17న స్వదేశం వచ్చే క్రమంలో యూఏఈలోని షార్జా ఏయిర్ పోర్టులో పాత మొబైల్ సిమ్ కార్డు పైన మూడు లక్షల రూపాయలు (12,850 దిర్హంలు) బాకీ ఉందని అక్కడి పోలీసులు అరెస్టు చేయడంతో జైలు పాలయ్యాడు. శ్రీధర్ పేరుపై ఉన్న పాత మొబైల్ ఫోన్ సిమ్ కార్డును ఎవరో దుర్వినియోగం చేయడం వలనే ఈ పరిస్థితి తలెత్తిందని శ్రీధర్ తల్లి ప్రమీల తెలిపారు. ప్రభుత్వం ద్వారా అడ్వకేట్‌ను నియమించి శ్రీధర్‌కు న్యాయ సహాయం కల్పించాలని, అమాయకుడైన తన కుమారుడిని షార్జా జైలు నుంచి విడిపించి ఇండియాకు తెప్పించాలని శ్రీధర్ తల్లి ప్రమీల శుక్రవారం హైదరాబాద్ బేగంపేట మహాత్మా జ్యోతిభాపూలే ప్రజాభవన్ ప్రవాసీ ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరతూ విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, గల్ఫ్ జెఏసీ నాయకులు చెన్నమనేని శ్రీనివాస్‌రావు ఉన్నారు.

తప్పిపోయిన బాలుడు

- పోలీసులకు అప్పగించిన స్థానికులు



తప్పిపోయిన బాలుడు

కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో శుక్రవారం ఒక ఓ బాలుడు తప్పిపోగా ఒంటరిగా రోడ్డుపై బాలుడిని చూసినవారు ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. తప్పిపోయిన బాబు హిందీ మాట్లాడుతున్నాడని, సంబంధించిన వారు గుర్తించి తీసుకువెళ్లాలని పోలీసులు కోరుతున్నారు.

లైంగిక వేధింపు కేసులో రెండేళ్లు జైలు శిక్ష

జగిత్యాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పు వెలువరించారు. పెగడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికను ప్రభాకర్(25) అనే వ్యక్తి లైంగికంగా వేధించడంతో బాధితురాలు పెగడపెల్లి పోలీసులకు నాలుగేళ్ల క్రితం ఫిర్యాదు చేయగా, పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణరావు కేసును వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి ప్రభాకర్‌కు న్యాయమూర్తి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆరె రమేష్ (39) అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. మెట్‌పల్లికి చెందిన రమేష్ మేడిపల్లి గ్రామంలో వారి వృత్తిలో భాగంగా కుటుంబంతో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మేడిపల్లి నుంచి మెట్‌పల్లికి అతని ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా, నడుపుతూ ఇబ్రహీంపట్నం క్రాసింగ్ వద్ద వాహనం అదుపు తప్పి పక్కనున్న చెట్టుకు ఢీకొట్టి బండరాళ్లపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు రమేష్ భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

డేంజర్.. సెల్‌ఫోన్ డ్రైవింగ్

- రెప్పపాటులో ప్రమాదాలు- గాలిలో కలుస్తున్న ప్రాణాలు



సిరిసిల్ల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరంగా మారింది. ఏ వాహన చోదకుడిని చూసినా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కనిపిస్తుంది. ఇయర్‌ఫోన్స్‌తోనూ ప్రమాదాలు తప్పడంలేదు. ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని మ్యూజిక్ జోష్‌లో అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. వెనక నుంచి వచ్చే వాహనాల శబ్దం వినిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా రాజన్న సిరిసిల్ల జిల్లాలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా ద్విచక్రవాహనదారులు చెవిలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని అతివేగంగా వెలుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

మ్యూజిక్ వింటూ డ్రైవింగ్..

యువత ఇయర్‌ఫోన్‌ల ద్వారా మ్యూజిక్ వినే జోష్‌లో ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని రోడ్డుపై వాహనాలు నడుపుతూ వెనుక వచ్చే వాహనాలను పట్టించుకోవడంలేదు. ఇటీవలఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు వాడకం పెరిగింది. వీటి ద్వారా బయట శబ్దాలు అసలు వినిపించవు. ఈ తరహా ఇయర్‌ఫోన్లు వాడుతూ రోడ్డు దాటడం, డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరం. చుట్టుపక్కల శబ్దాలు వినిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్రవాహనదారులే కాకుండా ఆటోలు, కార్లలో పెద్ద సౌండ్స్‌తో పాటలు వింటూ డ్రైవింగ్‌చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. హెల్మెట్‌లోనూ సెల్‌ఫోన్ పెట్టుకొని మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే చాలామంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని ఇతరులతో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. హెల్మెట్‌లోపల చెవి దగ్గర సెల్‌ఫోన్ పెట్టుకోవడంతో పక్కనుంచి వచ్చే వాహనాల హారన్ వినడపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు ఫోన్‌లు పట్టుకుని చాటింగ్ చేస్తూ డ్రైవ్ చేస్తుంటారు. దృష్టి రోడ్డుపై పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

● డ్రైవింగ్‌పై దృష్టి పెట్టాలి

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు క్షేమంగా గమ్యం చేరాలి. ప్రతి వాహనచోదకుడు డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు రోడ్డుపై మాత్రమే దృష్టి సారించాలి. స్టీరింగ్ చేతిలో ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడననే నియమం పెట్టుకోవాలి. ఒకవేళ మాట్లాడాల్సి వచ్చినా రోడ్డు పక్కన వాహనం నిలిపి మాట్లాడాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



డ్రైవింగ్ సమయంలో నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సిరిసిల్లలో యువత అతివేగంగా వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్లకు వాహనం ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తాం. వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడితే జరిమానా విధిస్తాం. - అఖిల్ మహాజన్, ఎస్పీ , రాజన్న సిరిసిల్ల జిల్లా

యువత క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే రాష్ట్రానికి, దేశానికి పేరు వస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ బాల బాలికల హాకీ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాగరాజు ఆటగాళ్లను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. హుజూరాబాద్ హాకీకి పుట్టినిల్లు అన్నారు. ఎంతో మంది ఇక్కడ నేర్చుకొని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బండ శ్రీనివాస్, వర్ధినేని రవీందర్‌రావు, సబ్బని వెంకట్, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, సొల్లు సారయ్య, పీఈటీలు రాజిరెడ్డి, వేణుగో పాల్, సారయ్య, రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక, శేఖర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో గురుకుల పాఠశాల భవనం

- ఆరుబయటే స్నానాలు, టాయిలెట్లు కరువు - తరగతి గదుల్లోనే లగేజీ - పట్టించుకోని పాలకులు, అధికారులు



గురుకుల పాఠశాల భవనం

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనాథలు, డ్రాప్ ఔట్ విద్యార్థుల విద్యకోసం ఏర్పాటు చేసిన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. శిథిలావస్థ భవనం, చుట్టూ విష సర్పాల సంచారం, ఆరు బయట స్నానాలు, మల మూత్ర విసర్జనలతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న పట్టణ గురుకుల పాఠశాల విద్యార్థుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. 46మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. 5నుంచి 8 తరగతుల విద్యార్థులకు కేవలం మూడు గదులే ఉండడంతో అందులోనే నెట్టుకొచ్చే పరిస్థితి నెలకొంది. వాష్‌రూం, బాత్రూంలలో నీరు లేకపోవడంతో వాటిని లగేజీ స్టోరేజీలుగా విద్యార్థులు వాడుకుంటున్నారు. ఉన్న ఒకే టాయిలెట్‌లో నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాల నిమిత్తం ఆరుబయటకు వెళ్లాల్సివస్తుంది. కొన్నిసార్లు మున్సిపల్ నల్లా రాకపోతే, చివరికి ట్యాంకర్ తెప్పించి విద్యార్థులకు స్నానాలు, ఇతర అవసరాలకు వినియోగించకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. భవనం పగుళ్లతో బిక్కుబిక్కుమంటూ వసతి, విద్యను అభ్యసిస్తున్నారు విద్యార్థులు. తమ సమస్యలపై ఇప్పటికే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులుకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

- విష సర్పాలతో బిక్కుబిక్కుమంటూ..

జగిత్యాల పట్టణ గురుకుల బాలుర పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా ధరూర్ క్యాంపులోని ఎస్సారెస్పీకి చెందిన గెస్ట్‌హౌస్‌లోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. భవనం చాలా ఏళ్లకింద నిర్మించింది కావడంతో పగుళ్లు వచ్చి, శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు భవనం చుట్టూ చెట్లు, పిచ్చిమొక్కలు అత్యధికంగా ఉండడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. గతంలో పాఠశాల కిచెన్‌లోకి దూరిన పామును చంపారని విద్యార్థులు పేర్కొంటున్నారు. బాత్రూంలు లేకపోవడంతో రాత్రివేళల్లో మలమూత్రాలకు వెళ్లాలంటే భయంగా ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కూతవేటు దూరంలోనే అధికారుల కార్యాలయాలు

2017లో 13 మందితో ప్రారంభమైన పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 46 మందికి చేరింది. ప్రతియేటా విద్యార్థుల సంఖ్య నమోదు అవుతున్నా అసౌకర్యాల కారణంగా విద్యార్థులు ఉండలేక పాఠశాలను వీడి వెళ్లిపోతున్నారు. పాఠశాల భవనం సమీపంలోనే ఎమ్మెల్యే, కలెక్టర్ క్యాంపు కార్యాలయాలు ఉండడం, జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోనే ఆయా కార్యాలయాలు అన్ని హంగులతో ఉంటే, పాఠశాల భవనం మాత్రం శిథిలావస్థలో ఉండడం గమనార్హం. పాఠశాల పరిస్థితులను గతంలోని పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల భవనాన్ని మరోచోటుకు మార్చాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

- భోజనం పరిశీలించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు

విద్యార్థుల ఇక్కట్లపై వచ్చిన వార్తా కథనాలతో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో పాఠశాలలో కిచెన్‌ను సందర్శించి భోజన వంట తీరును పరిశీలించారు. బియ్యం, ఇతర వంట సామగ్రి నిల్వ ఉంచేందుకు ప్రత్యేక గది లేకపోవడంతో ఎలుకల వల్ల ఇబ్బంది తలెత్తే ప్రమాదం ఉందని, కూరగాయలు కోసే చోట పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కిచెన్ స్టోర్ రూంలు ప్రత్యేకంగా ఉండాలన్నారు. హాస్టల్‌లో వంట మనుషుల నిర్లక్ష్యంపై అనూష అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవస్థలు కలుగకుండా చూడాలని ఆదేశించారు.

భవనం సరిగా లేక ఇబ్బంది..



పాఠశాల భవనం పగుళ్లతో శిథిలావస్థకు చేరింది. కనీసం సరిపడా బాత్రూంలు లేవు. ఆరుబయటే స్నానాలు చేస్తున్నాం. మున్సిపల్ నల్లానీరే ఆధారం. సరిపడాగదులు అవస్థలు పడుతున్నాం. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- రాంచరణ్, 8వ తరగతి విద్యార్థి

విష సర్పాలతో భయంగా ఉంది..



బాత్రూంలు లేకపోవడంతో రాత్రిపూట ఆరుబయటకు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. పాఠశాల పరిసరాల్లో విషసర్పాల సంచారం ఉంది. బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది.

- అశ్వంత్, 8వ తరగతి విద్యార్థి

ఇబ్బందులు గమనించాం..



అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో భవనం శిథిలావస్థలో ఉండడం, ఇరుకైన గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవడం వాస్తవమే. పాఠశాలను సందర్శించి పరిస్థితిని గమనించాం. పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం.

- రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7వేల రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 127క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 18క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర .7వేలు, కనిష్ఠ ధర 6,300 రూపయాలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. 280 మంది రైతులు 4,500క్వింటాళ్ల పత్తిని సీసీఐకి మద్దతు ధర ప్రకారం విక్రయించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

గంగాధర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల వివేకానంద విద్యాలయం విద్యార్థిని సాత్విక రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈనెల 24న ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్వ ర్యంలో రాజన్న సిరిసిల్లలో నిర్వహించిన పోటీల్లో సాత్విక ప్రతిభ చాటి ఎంపికైందని చెప్పారు. సాత్విక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాత్వికను కరస్పాండెంట్ లక్ష్మారెడ్డితో పాటు ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, నర్సింగరావు, డైరెక్టర్ అనంతరెడ్డి తదితరులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో రాణించాలని సూచించారు.

నకిలీ విలేకరుల అరెస్టు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో ఇద్దరు నకిలీ విలేకరులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి నుంచి సాతారం గ్రామంలోని ఓ కిరాణ షాపునకు సామాను తరలిస్తున్న కారును పట్టణ శివారులో ఆపి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు నకిలీ విలేకరులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన కార్తీక్, శేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు వెంకటరమణ అనే వ్యక్తిని బెదిరింపులకు పాల్పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అక్రమ కార్యకలాపాలను అడ్డుకుంటామని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి..

- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఆ దిశగా రైతులను చైతన్యపరిచేందుకు చర్యలు చేపడుతున్నది. రాయితీలను సైతం ప్రకటిస్తూ ప్రోత్సాహిస్తోంది. ఈక్రమంలో ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని 12 గ్రామాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేశారు.



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి, రైతులు

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలంలోని 12గ్రామాల పరిధిలో సుమారు 120 ఎక రాల్లో రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగుచేశారు. పెట్టుబడి తక్కువ తక్కువ.. ఆదాయం ఎక్కువ వస్తుం దని అధికారులు సూచిస్తుండడంతో ఆ దిశగా రైతులు మొగ్గు చూపుతున్నారు. రైతులకు ఆయిల్‌పామ్ మొక్క లను ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోంది. మొక్కల సంరక్షణ కోసం ప్రభుత్వం యేటా ఎకరానికి 4,200రూపాయలను నాలుగేళ్లపాటు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుంది. మొక్కలు పెరిగి సుమారు 35ఏళ్లపాటు ఏటా ఎకరానికి 10నుంచి 16ట న్నుల వరకు దిగుబడి వస్తుందని ఉదాన్యవన శాఖ అధి కారులు చెబుతున్నారు.

- అంతరపంటలతో ఆదాయం..

లాలపల్లి గ్రామంలోని రైతులు ఆయిల్‌పామ్ తోటల్లో ఆరుతడి పంటలైన టమాట, కాకర, బూరబెండ, అల సంద, కాలీఫ్లవర్ వంటి కూరగాయలతో పాటు, వేరుశ నగ, మొక్కజొన్న, కీరదోస వంటి పంటలను సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది.



లాలపల్లిలో రైతులు సాగుచేసిన ఆయిల్‌పామ్ మొక్కలు

నాలుగు ఎకరాలు సాగుచేశాను..



నాకున్న వ్యవసాయ భూమిలో కొంత వరితో పాటు నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను పెంచుతున్నాను. ఇప్పటికి ఏడాది కావస్తుండగా అందులో కూరగాయలను సాగు చేస్తున్నాను. అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ వరిపంటకు వచ్చే ఆదాయాన్ని పొందుతున్నాను.

- బద్దం తిరుపతిరెడ్డి, లాలపల్లి

అంతరపంటగా కూరగాయల సాగు..



రెండెకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను పెట్టి, అంతర పంటగా కూరగాయలు పండిస్తున్నాను. ప్రస్తుతం టమాట, బీరకాయ పంటలు క్రాప్‌కు వచ్చాయి. అలాగే ఖాలీఫ్లవర్ పూతదశలో ఉంది. అంతరపంటల వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం సమకూరుతుంది.

- బి.మల్లారెడ్డి, లాలపల్లి

రైతులు ముందుకు రావాలి..



దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యపరుస్తున్నాం. అంతర పంటలతో కూడా అదనపు ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకుంటూ లాభదాయక పంటలవైపు మొగ్గుచూపాలి.

- అభిలాష్, ఉద్యానశాఖ ఫీల్డ్‌ఆఫీసర్

ఘాట్‌రోడ్డుపై హెచ్చరిక ఫ్లెక్సీల ఏర్పాటు



కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వద్ద సీఐ, ఎస్సై

మల్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై తరచూ జరుగుతన్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మల్యాల పోలీసులు డ్రైవర్లకు అవగాహన కల్పించే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డు వెంట అయిదు చోట్ల వాటిని ఏర్పాటు చేశారు. వాహనాలను న్యూట్రల్‌లో కాకుండా గేరులోనే నెమ్మదిగా నడపాలని అందులో సూచించారు. వాహనాల పరిమితికి మించి ప్రయాణించకూడదని పేర్కొన్నారు. ఘాట్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై ఎ నరేశ్‌కుమార్ పరిశీలించారు. పరిమితికి మించి వాహనాలను కొండపైన నియంత్రించే చర్యలు తీసుకోవాలని, ప్రమాద నివారణ చర్యలు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈసరి జనార్దన్

సుభాష్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెం కట స్వామి ఆధ్వర్యంలో డిసెంబరు 1న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాలల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఈసరి జనార్దన్, కో కన్వీనర్ అర్ష మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం నగరం లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాలల పట్ల చూపుతున్న వివక్షను ఎదుర్కోవడం, మాలలపట్ల చిన్నచూపు వంటివి వ్యతిరేకిస్తూ తలపెట్టిన సింహగర్జన సభకు ఉమ్మడి జిల్లాలోని మాలలందరూ అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. మాలలకు జరుగుతున్న అన్యాయం సమాజానికి తెలియజేయడం కోసమే సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరా బాద్ సభకు వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎక్కడ కూడా ఇబ్బం దులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో నక్క రాజయ్య, రొడ్డ శ్రీనివాస్, నల్లల కనకరాజు, ఎలదాసరి లింగయ్య, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక రద్దీ

- ధర్మపురి, వేములవాడలో భక్తుల ప్రత్యేక పూజలు - దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



ధర్మపురిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి, వేములవాడ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరి గింది. లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు క్షేత్రానికి వేలాది మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

- 28వ రోజు గోదావరి హారతి

ధర్మపురి క్షేత్రంలో 28 రోజు శుక్రవారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, తిరుమల సేవా గ్రూపు మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం వేళలో గోదావరి నదికి శోభా యాత్ర నిర్వహించారు. రాత్రి గోదావరి మాతకు హారతి నదిలో దీపాలు వదిలారు.

- రాజన్న ఆలయానికి..

వేములవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లింపునకు సుమారు రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు రాజన్న ఆలయ ఆవరణలో దీపాలను వెలిగిం చారు. అనంతరం అన్న, కల్యాణ పూజల్లో పాల్గొన్నారు.

- సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం రాజన్న ఆలయ కలావేదికలో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ప్రారంభించారు. మహిళలు వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కళావే దికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- ఘనంగా మహాలింగార్చన

రాజన్న ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్తీక శుక్రవారం సందర్భంగా ఉదయం ఆలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. రాత్రి ఆలయ అద్దాల మండపంలో లింగాకృతిలో పిండితో దీపాలు తయారు చేసి వెలిగించారు.



గోదావరి వద్ద గంగా హారతి పూజలు చేస్తున్న అర్చకులు



రాజన్న ఆలయంలో మహాలింగార్చనలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు అంజన్న నిధులు

- అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల చెల్లింపు
- కొండగట్టుతో పాటు మరిన్ని ఆలయాల నుంచి సేకరణ

మల్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో గల శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోసం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి ఆరు లక్షల రూపాయలు చెల్లించాలనే దేవాదాయశాఖ సూచనల మేరకు కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బంది వేతనాల కోసం 32 లక్షల రూపాయలను సమకూర్చుతుండగా కొండగట్టుతో పాటు ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నుంచి ఎనిమిది లక్షలు, వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం నుంచి తొమ్మిది లక్షలు, యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నుంచి తొమ్మిది లక్షల రూపాయల ఆర్థికసహాయం కోరుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే దేవస్థానాల నుంచి నిధులు సమకూర్చుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతుండగా సంస్కృత భాషను కాపాడుకోవడానికేనని పలువురు పేర్కొంటున్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలకు కూడా నిధులు, సౌకర్యాలు, బోధన సిబ్బంది నియామకానికి ప్రభుత్వం, దేవాదాయశాఖ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీఎం కప్ పోటీలు కరీంనగర్‌లో నిర్వహించాలి

- మంత్రి పొన్నంకు క్రీడా సంఘాల వినతి



పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ కప్-2024 రాష్ట్రస్థాయి యోగా పోటీలు కరీంనగర్‌లో నిర్వహించాలని తెలంగాణ యోగా అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రిని చిగురుమామిడిలో పలు క్రీడా సంఘాల బాధ్యులు కలిసి విజ్ఞాపనత పత్రం అందజేశారు. రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు హుస్నాబాద్ వేదికగా, రెజ్లింగ్ హనుమకొండలో నిర్వహించాలని కోరారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోని బాలాదేవితో మాట్లాడి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు మూడు జిల్లాల్లో నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కబడ్డీ సంఘం సభ్యులు కృష్ణ యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎం సమ్మయ్య తదితరులు ఉన్నారు.

నేడు గోదావరి మహాహారతి

- ఏర్పాట్లను పరిశీలించిన ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్‌రాంసుధాకర్‌రావు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం సాయంత్రం గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందు కోసం గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు. స్థానిక గోదావరి నది మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద మహాహారతి కోసం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ధర్మపురి క్షేత్రంలో 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత, గోదావరి హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్, బీజేపీ జాతీయ నాయకుడు పోల్సాని మురళీధర్‌రావు హాజరు అవుతారు. వైదిక స్మార్త జ్యోతిష్య పౌరాణికులు పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాంసుధాకర్‌రావు కోరారు. కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేందర్‌రెడ్డి, కందాల నర్సింహమూర్తి, బండారి లక్ష్మణ్, బెజ్జారపు లవణ్, నంగి శేఖర్, లక్ష్మీనర్సయ్యగౌడ్, కస్తూరి రాజన్న, నంగి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి



లక్ష్మీనరసింహస్వామి వద్ద పూజలు చేస్తున్న విశోక తీర్థ స్వామి

బీర్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని సత్యానంద ఆశ్రమ స్వామీజీ విశోక తీర్థస్వామి అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అఖండ జ్యోతి వెలిగించి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులతో హిందూ చైతన్య మహా పాదయాత్రను హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభించారు. పాదయాత్ర నర్సింహులపల్లి, తుంగూర్, కొల్వాయి, తాళ్లధర్మారం, కమ్మునూర్ గ్రామాల మీదుగా యాత్ర సాగగా ఆయా గ్రామాల్లోని మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ యాత్ర కమ్మునూర్‌లో గల గోదావరి పుష్కర ఘాటు వరకు సాగింది. గోదావరి మాతకు చీరే, సారే సమర్పించి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశోక తీర్థస్వామి మాట్లాడుతూ హైందవ ధర్మం సుభిక్షంగా ఉంటేనే ప్రపంచ శాంతి సాధ్యపడుతుందన్నారు. అనంతరం కార్యక్రమానికి ప్రధాన వక్తగా పాల్గొన్న సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలిగించి ప్రతీ ఒక్కరు సోదరులమే అనే భావనను పెంపొందించుకోవాలన్నారు. సామాజిక సమరసతలో భాగంగా నెల రోజుల నుంచి బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలను గ్రామాల్లోని దళిత బస్తీల్లో నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమరసతా వేదిక రాష్ట్రసహ కార్యదర్శి పుల్లేరి రామారావు, కనికరం లచ్చన్న, సంపూర్ణ చారి, భూమా రెడ్డి, బీర్‌పూర్ దేవాలయ ప్రధాన అర్చకులు సంతోషాచార్యులు, మధు కుమార చార్యులు, సంతోష్ చార్యులు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా.. ఒకరికి గాయాలు

గన్నేరువరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండా పూర్ శివారులో జంగపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గుండ్లపల్లి నుంచి మండల కేంద్రం మీదుగా పొత్తూరు వరకు కొనసాగుతున్న డబుల్ రోడ్డు పను లకు కాంక్రీటును తరలిస్తున్న టిప్పర్ రోడ్డు అంచు వరకు వెళ్లడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ చోటా సాకేత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సాకేత్‌ను ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో అయ్యప్ప ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ ఆధ్వర్యంలో వేదపండితులు కశోజ్జల రాజేష్‌శర్మ, అర్చకులు గుండి అశ్విన్‌శర్మ, అయ్యప్ప దీక్షా పరులు లక్ష్మీ నృసింహస్వామి ఆలయం నుంచి గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నది వద్ద స్వామివారల విగ్రహాలకు గోదావరి జలంతో అభిషేకం చేశారు. అనంతరం ఆరట్టు ఉత్సవం నిర్వహించారు. అనంతరం అర్చకులు కలశ గణపతి, సుబ్రమణ్య, మాలికా అమ్మవారలకు అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారలకు రుద్రాభిషేకం, విశేష పూజ, పడి పూజ, హారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం విప్ మాట్లాడుతూ అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆలయ నిర్మాతలు భీమనాతి అశోక్-మంగ దంపతులు, బుగ్గారం, పెగడపల్లి మాజీ జడ్పీటీసీలు బాదినేని రాజేందర్, కాసుగంటి రాజేందర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

వెల్గటూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశ నుంచే చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ సూచించారు. శుక్రవారం వెల్గటూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పాలన దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేయడంలో వారి సృజనాత్మకత బహిర్గతమవుతుందన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయులు బంధెల అనిల్ కుమా ర్, ఉపాధ్యాయులు సత్యం, నరేష్ కుమార్, వీరబత్తిని శ్రీనివాస్, గాజుల రమ్యశ్రీ, ఐఈ ఆర్పీ శ్రీలత, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఆర్‌బీఎస్‌కే, జిల్లా అంధత్వ నివారణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 600 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న 25 మంది విద్యార్థులను గుర్తించి వారికి త్వరలోనే జిల్లా అంధత్వ నివారణ సమితి ఆధ్వర్యంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తామని అధికారి తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ రేవతి, ఏఎన్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆహ్లాదం కోసం అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేగంగా విస్తరిస్తున్న జగిత్యాల పట్టణంలో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణం పొందేందుకు అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధిని చేపట్టామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 25, 10వ వార్డు లింగంపేటలో సిమెంట్ రోడ్డు, మురికి కాలువల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగంపేటకు మంజూరైన బస్తీ దవాఖానా టెండర్ ప్రక్రియ నడుస్తుందని, పట్టణంలో వైకుంఠధామాలకు సైతం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశామన్నారు. అన్ని కుల సంఘాలకు నిధులు మంజూరు చేశామని, పట్టణంలో ఉన్న 12 జోన్లకు 120కి పైగా సర్వే నంబర్లను మార్చడం వల్ల ప్రజలకు ఉపయోగంగా మారిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు ఆరుముల్ల నర్సమ్మ, సిరికొండ భారతి, ఆరుముల్ల పవన్, సిరికొండ రాజయ్య, దూమాల రాజ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఎంఏ ఆరిఫ్, తురక రాజరెడ్డి, ఏఈ శరణ్ తదితరులు పాల్గొన్నారు.

● జగిత్యాల పట్టణంలోని కండ్లపెల్లి చెరువులో లక్షా 35 వేల చేప పిల్లలను ఆయన ఎమ్మెల్యే సంజయ్ వదిలారు. ఎంపీడీవో రమాదేవి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుమ్ముల అంజయ్య పాల్గొన్నారు.


లబ్ధిదారులతో ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్

● నూతనంగా ఎన్నికైన జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్, కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, పట్టణంలోని వైద్యులు పాల్గొన్నారు.

● అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయం

సారంగాపూర్ (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే డాక్టరు సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తని రైతుల సంక్షేమానికి ఆయన కృషి చేస్తున్నారన్నారు. పోతారం గ్రామంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ 10 లక్షలు విద్యుత్ సదుపాయాలకు, 3 లక్షల 30వేలు డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరి చేసినట్లు తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టు చివరి దశ పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమీర్, ఆర్ఐ బాస్కర్‌రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రాక ఆర్పీల విలవిల

3వ పేజీ తరువాయి

వేతన బకాయిలు విడుదల చేయాలి



ఎం అనిత, మెప్మా రిసోర్స్‌పర్సన్, కోరుట్ల, జగిత్యాల

అయిదు నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలి. చాలీ చాలని వేతనం ఇస్తూ అదికూడా నెల నెల అందించకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నాము. మెప్మా రిసోర్స్ పర్సన్‌ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించక పోవడం బాధాకరం. స్వయం సహాయక మహిళా సంఘాల పనులతో పాటు ప్రభుత్వం అమలు చేసే పలు కార్యక్రమాలల్లో భాగస్వామ్యం అవుతున్నాము.

వేతనం తక్కువే...అది కూడా సమయానికి రావడం లేదు



కొయ్యాడ రమాదేవీ, మెప్మా రిసోర్స్ పర్సన్, జగిత్యాల

మున్సిపాలిటీల్లో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ నిరంతరం సేవలు అందిస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు అందిస్తున్న వేతనం తక్కువే..అదికూడా సమాయానికి అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. నెల నెల వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

బకాయిలు విడుదల కావాల్సి ఉంది:శ్రీనివాస్, మెప్మా ఏవో, జగిత్యాల జిల్లా



జగిత్యాల జిల్లాలోని మెప్మా రిసోర్స్ పర్సన్స్‌లకు వేతన బకాయిలు విడుదల కావాల్సి ఉంది. అయిదు నెలల వేతనాల విడుదలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం అందించాము. బడ్జెట్ విడుదల చేయగానే వేతనాలు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాము.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బీర్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింహులపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు శుక్రవారం పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాలతో మండల విద్యాధికారి నాగ భూషణం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నీలిమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేసి వంటకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో రాణించిన యువకుడు

వెల్గటూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో వెల్గటూరుకు చెందిన పవన్ కల్యాన్ అనే యువకుడు రాణించాడు. రాష్ట్రస్థాయి పోటీలలో రెండు బహుమతులు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. పరుగు పందెం పోటీలో ప్రథమ స్థానం, షాట్ పుట్ త్రోలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ప్రభుత్వ వికలాంగుల సాధికార సంస్థ డైరెక్టర్ బి శైలజ, కలెక్టర్ సత్యప్రసాద్, సంక్షేమ అధికారి బోనగిరి నరేష్ బహుమతి ప్రదానం చేశారు. పవన్‌కల్యాన్ రాష్ట్రస్థాయిలో రాణించడంపై కుటుంబసభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అశ్విత్‌కు సన్మానం

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన రాష్ట్ర స్థాయి క్రీడకారుడు పెంటవర్తి అశ్విత్‌ను శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకుడు నలిమెల నర్సింహారెడ్డి స్థానిక నాయకులతో కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ కిడ్స్ జావిలిన్ త్రో పోటీల్లో గ్రామానికి చెందిన నాలుగవ తరగతి చదువుతున్న పెంటవర్తి అశ్విత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచాడు. డిసెంబర్ 1న మంచిర్యాల్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అశ్విత్‌ను నిర్వాహకులు ఎంపిక చేశారు. దీంతో గ్రామంలోని బీజేపీ నాయకులు శాలువతో సన్మానించి అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందాలని ఆకాక్షించారు. నాయకులు మాజీ సర్పంచ్ మారంపల్లి శ్రీనివాస్, దొంగిసారం లచ్చయ్య, పల్లికొండ గంగనర్సయ్య, జోగ హరీష్, బింగి నటరాజ్, గంగాధర్, పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు క్షమాపణ చెప్పాలి

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గల్ఫ్ బాధిత కుటుంబాలకు కల్వకుంట్ల కుటుంబ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డితో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉపాధి నిమిత్తం ఎవరు గల్ఫ్ వెల్లవలసిన అవసరం లేదని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ గల్ఫ్ బాధితులను మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గల్ఫ్ బాధితులకు ఎక్స్‌గ్రేషియా అందించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రొసీడింగ్ పత్రాలను గల్ఫ్ బాదిత కుటుంబ సభ్యులకు కృష్ణారావు అందించారు. సమావేశంలో తిరుమల గంగాధర్, కొంతం రాజం, గడ్డం వెంకటేష్ గౌడ్, పెరుమాండ్ల సత్యనారాయణ, పోతుగంటి శంకర్ గౌడ్, చేపూరి కృష్ణారెడ్డి, అబి, పడాల అచ్చయ్య, సదుల వెంకట స్వామి, నల్ల రామరాజ్, ఎంబేరి సత్యనారాయణ, చల్ల పురుషోత్తం, చిట్యాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నవచేతన విజ్ఞానసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంచార పుస్తక ప్రదర్శనను కోరుట్ల పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత మున్సిపల్ వద్ద సంచార పుస్తక ప్రదర్శనను స్థానిక నాయకులతో కలిసి జువ్వాడి సోదరులు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, ఏలేటి మహిపాల్‌రెడ్డి, చిట్యాల లక్ష్మీనారాయణ, పసుల కృష్ణప్రసాద్, ఎడ్ల రమేష్, కడకుంట్ల గంగాధర్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి

గొల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 6వ తేదీ నుంచి జరగనున్న మల్లికార్జున స్వామి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయాన్ని డీఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రదేశాలను పరిశీలించి భద్రత ఏర్పాట్లను, పార్కింగ్ స్థలాలను గుర్తించి జాతర నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. జాతర సందర్భంగా పోలీసు బందోబస్తును పటిష్ఠంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్థులు, భక్తులు సహకరించాలని కోరారు. కాగా, మొదటిసారి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన డీఎస్పీ, సీఐ, ఎస్సైలు గర్భగుడిలోని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, ఆలయ పౌండరీ ట్రస్టీ కొండూరి శాంతయ్య సీఐ, ఎస్సైలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు చిర్ర సతీష్‌కుమార్, మాడ శ్రీధర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు గోస్కుల రాజన్న, బేర కిషోర్, భీమ సత్తయ్య, నాయకులు *మల్లయ్య, చంధు, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ప్రభుత్వ విప్‌ను కలిసిన నాయకులు

భీమారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన భీమారం మండలానికి నూతన మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, జిల్లా నాయకులు నీరటి మల్లేశం, మండల ఉపాధ్యక్షుడు పుప్పాల కొమురయ్య, తోకల నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మిట్టపెల్లి రాజారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సయ్యద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి గణేష్, మాజీ సర్పంచ్ లచ్చానాయక్, సీనియర్ నాయకులు చెక్కపెల్లి శంకర్, ప్యాట నారాయణ, పుల్లూరి దేవయ్య, పడాల వెంకటాచారి, దువ్వాస గంగాధర్, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, కొత్తపెల్లి అజయ్, ఎండీ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారలకు ప్రత్యేక పూజలు చేశారు. శారదా శంకరాచార్యులు, గణపతి ఆలయంలో స్వామివారలకు పూజలు చేసి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహుకరించి సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను జగిత్యాల నూతన డీఈవో రాము మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా కేంద్రంలో డిసెంబరు 10 న నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ చర్చి పాస్టర్లు ఆయనకు ఆహ్వాన పత్రిక అందించారు. రాయపట్నంలో విద్యుత్ షాక్ తగిలి రాందేని మహేష్ మృతి చెందగా ప్రభుత్వం నుండి మంజూరు చేసిన రూ 4.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు ఆయన అందించారు.


లక్ష్మణ్‌కుమార్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

మల్లాపూర్, నవంబరు, 29 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే పరమావదిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తోందని కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మాజీ జడ్పీటీసీ, కిసాన్ సెల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు జలపతిరెడ్డితో కలిసి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి మండలంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. అన్ని విధాలుగా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రైతు పండగను విజయవంతం చేయాలని రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, పాలక వర్గంతో పాటు నాయకులు జలపతిరెడ్డి, నల్ల రాజన్న, పుండ్రా శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, ఆనంద్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, మరిపెల్లి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


గుండంపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నర్సింగరావు

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు విశేష స్పందన

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మ ప్రచార కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు స్పందన లభించింది. పోటీలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్ని 47 శ్లోకాలు విద్యార్థులు కంఠస్థం చేసి పోటీలో పాల్గొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అందజేసి ప్రశంసాపత్రాలను ఇచ్చి సన్మానం చేశారు. పోటీలలో న్యాయనిర్ణేతగా తెలగు ఉపాధ్యాయుడు బట్టు హరికృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల గీతా సత్సంగ్ సభ్యులు మర్రి భాస్కర్, చిటిపల్లి శంకర్ పాఠశాల ప్రదానోపాధ్యాయుడు కృష్ణమోహన్, టీటీడీ ధర్మాచార్యులు మంచాల జగన్ పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిరంతరం మద్యం మత్తులో తల్లిని తండ్రి వేధించడాన్ని భరించలేక మనస్తాపం చెందిన కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కోరుట్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి పట్టణంలోని శాంతి నగర్ ప్రాంతానికి చెందిన హన్మంత్-సాయమ్మ దంపతులు కూలి పనిచేస్తూ జీవిస్తున్నారు. హన్మంత్ నిరంతరం మద్యం సేవించి అతడి భార్య సాయమ్మతో గొడవపడి కొట్టేవాడు. వారి కొడుకు రాకేష్(20) తండ్రిని ఎన్నిమార్లు వద్దని బతిమిలాడినా వినిపించుకునే వాడు కాదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూడా గొడవ పడగా మనస్తాపం చెందిన రాకేష్ కోరుట్ల పట్టణంలో స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని తెలిపి ఇంట్లో నుంచి కోరుట్లకు వచ్చాడు. ఈ క్రమంలో రాకేష్ కోరుట్ల పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీ వద్ద వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరకోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు రాకేష్ తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

రాయికల్/కొడిమ్యాల/మెట్‌పల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాలల ఆత్మ గౌరవం కోసం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయికల్ మండల మాల సంఘం నాయకులు అన్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకు రాయికల్ నుంచి కుల సంఘ సభ్యులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మాలల సింహగర్జన పోస్టర్‌ను కొడిమ్యాల మండలంలోని నమిలికొండ శివారు గ్రామమైన గోపాల్‌రావుపేటలో మాలల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మనగర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జనకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు లక్ష్మణ్, రాజశేఖర్, సుమన్, రమేష్, చంద్రమోహన్, ప్రభాకర్, మురళీ, గంగారాం, పొట్ట రమేష్, రాకేష్, సృజన్, ఋషి, రాజేష్, పుర్రె చిన్ననర్సయ్య, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి

వెల్గటూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవితంలో త్వరగా స్థిర పడాలంటే గణితంపై పట్టు సాధించాలని మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ గణిత ఫోరం వెల్గటూర్ మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణితం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ మంచాల సురేష్‌కుమార్ తన తల్లిదండ్రులు వెంకటస్వామి సరోజన జ్ఞాపకార్థం విద్యార్థులకు జ్ఞాపికలు, స్నాక్స్ విరాళం అందించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిప్ప నందయ్య, మండల గణిత ఫోరం అధ్యక్షులు మాదాడి శ్రీధర్ రెడ్డి, పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులతో మండల స్థాయిలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవులు, రాయికల్ బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి రాజశేఖర్, గణిత ఫోరం రాయికల్ మండల అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.


వెల్గటూర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం (టీఎంఎఫ్) పెగడపల్లి శాఖ ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేయగా మండల విద్యాధికారి సులోచన, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లలిత భారతి ప్రారంభించారు, విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమం లో ఫోరం అధ్యక్షులు లింగంపల్లి లచ్చయ్య పాల్గొన్నారు.

బుగ్గారం: తెలంగాణ గణిత ఫోరం బుగ్గారం మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి గణితం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు విద్యాధికారి వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి మ్యాథమెటిక్స్‌పై టాలెంట్ టెస్టులు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఎంఈవో నాగబూషణం, కాంప్లెక్స్ హెచ్ఎం సత్య రాజ్, నరసింహమూర్తి, రాజశేఖర్, కుమార్, శ్రీలత, రాజేందర్ అభి నందించారు.

కొడిమ్యాల: తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు గణితంలో ప్రతిభ పోటీలను నిర్వహించారు. ఈప్రతిభ పోటీలకు మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు హెచ్ఎం విజయేంద్ర బహుమ తి ప్రదానం చేశారు

'బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటే'

మెట్‌పల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వంపై అనవసరపు విమర్శలు, ఆరోపణలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని, తెరచాటున రాజకీయాలు చేయడంలో వారికి పెట్టింది పేరని మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మెట్‌పల్లి మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ పది సంవత్సరాలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అధికారం చెలాయించిన బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం లేకనే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారని తెలిపారు. ఈ విషయాన్ని బీజేపీ పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ, రాష్ట్రాల అభివృద్ధిని పక్కనబెట్టి మతరాజకీయాలను చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. మెట్‌పల్లి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పన్నాల మాధవరెడ్డి, మార్గం గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

గొల్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజనం కార్మికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు సీపెల్లి పద్మ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన కార్మికులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు 10 వేల రూపాయల వేతనాన్ని అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు సమర్పించారు. కార్యక్రమంలో మంజుల, సుజాత, సత్తవ్వ, అమృత, అమ్మాయి, లక్ష్మీ, ఎం. లక్ష్మీ తదితర మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సంక్షిప్త సమాచారం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేట గ్రామంలో శుక్రవారం జరిగిన అయ్యప్ప బిక్ష కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కల్వకుంట్ల సుజిత్‌రావు పాల్గొన్నారు.

భీమారం: తమ సంఘ కార్యకలాపానికి నిర్వహించుకోవడానికి వీలుగా కొంత స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు.

ఎండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఎండపల్లి బీజేపీ నాయకులు తహసీల్దార్ రవికాంత్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు రావు హన్మంతరావు, కొమ్ము రాంబాబు, సిగిరి ఆనంద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: కొడుకులు శ్మశానంలో వదిలేసి వెళ్లిన జగిత్యాల పట్టణానికి చెందిన అల్లంకొండ రాజవ్వను బుధవారం జగిత్యాల పట్టణంలోని సఖి సెంటర్‌కు తరలించిన సంగతి తెలిసిందే. కాలునొప్పితో బాధ పడుతున్న వృద్ధురాలిని సఖి సిబ్బంది జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మూడు రోజుల నుంచి ఇప్పటివరకు కుమారులుగానీ, బంధువులు గానీ వృద్ధురాలి కోసం ఆస్పత్రికి రాకపోవడంతో సఖి సిబ్బంది వృద్ధురాలి బాగోగులు చూస్తున్నారు. వృద్ధురాలు తనకు తన కొడుకుల దగ్గరికి పంపించాలని ఆమె దగ్గరికి వెళ్లినవారిని వేడుకుంటుంది.

ధర్మపురి: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వొజ్జల నరేందర్ అనే పూజారి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. చొప్పదండిలో పూజారిగా పనిచేస్తున్న నరేందర్ ఇంటికి తాళం వేసి ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న కొంత సామగ్రిని అపహరించుకు వెళ్లారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల-రేగుంట బ్రిడ్జి సమీపంలో గ్రామానికి చెందిన సంకూరి రాజరెడ్డి, సోమ నారాయణరెడ్డి, నేముల స్వామి అనే రైతులకు సంబంధించిన చెరుకు తోట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ప్రమాదానికిగల కారణాలు తెలియరాలేదు.